క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో మాంట్‌ఫోర్డు విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

మఠంపల్లి : నల్లగొండలోని సెయింట్‌ ఆల్ఫోన్సెస్‌ హైస్కూల్‌లో నవంబర్‌ 23న జరిగిన రాష్ట్ర స్థాయి క్రిష్టియన్‌ మిషనరీ స్కూల్స్‌ విద్యార్థుల టోర్నమెంట్‌లో మఠంపల్లిలోని మాంట్‌ఫోర్డు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వాలీబాల్‌ పోటీలో ప్రథమ, ఖోఖోలో తృతీయ, అథ్లెటిక్స్‌, ఇంగ్లిష్‌, తెలుగులో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్‌ బ్రదర్‌ వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను, పీఈటీ సతీష్‌ను అభినందించారు.

కొనుగోలు కేంద్రాల్లో అరకొర వసతులు



కొనుగోలు కేంద్రం నిర్వాహకుడితో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మునగాల : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అరకొర వసతులు కల్పించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, కనగాల నారాయణరావు, భద్రంరాజు కృష్ణప్రసాద్‌ అన్నారు. మునగాల మండలంలోని తాడువాయిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని నిర్వాహకులు పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో రైతాంగం ఆందోళనకు గురవుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ప్రతి గింజనూ కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాని పీఏసీఎస్‌ సీఈఓ కోటయ్యను కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోదాడ డివిజన్‌ సహాయ సంచాలకుడు డి.యల్లయ్య కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్‌ వి.సరిత, మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్‌, ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, ఏఈఓ పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.


మాజీ ఎంపీటీసీ కుమారుడి మృతికి సంతాపం



శౌరీ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా మాజీ ఎంపీటీసీ దారావత్‌ శౌరీనాయక్‌ కుమారుడు రాముడునాయక్‌ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని కాంగ్రెస్‌ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు రాముడునాయక్‌ మృతదేహానికి నివాళులర్పించి శౌరీనాయక్‌ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు మంజీనాయక్‌, పీఏసీఎస్‌ మండల వైస్‌ చైర్మన్‌ బాబునాయక్‌, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, నాయకులు కిషోర్‌రెడ్డి, నవీన్‌నాయక్‌, బాలునాయక్‌, గోవింద్‌నాయక్‌, రాముడునాయక్‌, మోతీలాల్‌, తులసీరామ్‌నాయక్‌, భూక్యా నాగునాయక్‌, బోజ్యా, శంకర్‌, వెంకన్న, సైదా, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్‌పీ గ్రామ అధ్యక్షుల ఎన్నిక



నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

మునగాల : మండలంలోని నేలమర్రి గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్‌పీ గ్రామ కమిటీలను ఎంఎస్‌పీ మండల శాఖ ఇన్‌చార్జ్‌ ఎల్‌.శ్రీనివాస్‌, ఎమ్మార్పీఎస్‌ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్‌ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మొలుగూరి శ్రీకాంత్‌, ఎంఎస్‌పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పోకల మల్సూర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధికార ప్రతినిధి పాతకొట్ల నాగరాజు, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య, ఎమ్మార్పీఎస్‌ మండల నాయకులు బచ్చలకూరి సికిందర్‌, రమేష్‌, వీహెచ్‌పీఎస్‌ నాయకుడు బచ్చలకూరి గుర్వయ్య పాల్గొన్నారు.

అద్దె అంతంతే.. ఆక్రమణలే అధికం

- కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం
- అక్రమంగా దుకాణాల ఏర్పాటు
- దారిని కూడా వదలని వైనం
- పునాదులకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌



ఆక్రమణలతో ఇరుకుగా కోదాడ కూరగాయల మార్కెట్‌

కోదాడ : ముప్పై సంవత్సరాల క్రితం కోదాడ పట్టణ జనాభా 25 వేలు ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ అది. నాటి నుంచి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. దీనికి తోడు జోరుగా ఆక్రమణలు. పది గజాల స్థలంలో దుకాణం ఏర్పాటు చేసి దానికి మూడింతలు ఆక్రమణలు చేశారు. వాహనాల పార్కింగ్‌కు ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం పట్టణ జనాభా 70 వేలకు మించిపోయినా కూరగాయల మార్కెట్‌ మాత్రం సౌకర్యాలు లేక సమస్యలతో కునారిల్లుతోంది. అయినా దానిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తామన్న ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ పనులు రెండు ఏళ్లుగా పునాదులకే పరిమితమయ్యాయి.

రెండింతలు ఆక్రమణ..

కోదాడ కూరగాయల మార్కెట్‌ను మున్సిపల్‌ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి తమ సొంత ఆస్తిగా మార్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీకి చెందిన ఈ స్థలంలో 10 దుకాణాలకు అద్దెలు కడుతుండగా.. ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో 20కి పైగా దుకాణాలు అక్రమంగా ఏర్పాటు చేసుకొని అద్దెలు కట్టని పరిస్థితి నెలకొంది. గతంలో 10 టైర్ల లారీ కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లి కూరగాయలు దిగుమతి చేసేది. ప్రస్తుతం మార్కెట్‌ లోపలికి టూవీలర్‌ కూడా వెళ్లలేకుండా ఇరుకుగా మారింది. ప్రతి దుకాణదారుడు అసలు దుకాణానికి రెండింతలు ఆక్రమించడంతో మార్కెట్‌కు వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఇతర దుకాణాలే ఎక్కువ..

కోదాడ కూరగాయల మార్కెట్‌లో కూరగాయల దుకాణాలకన్నా ఇతర దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. అద్దెలు తక్కువగా ఉండడంతో కూరగాయల దుకాణాల పేరుతో ఇతర దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా మున్సిపల్‌ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ జాడ్యం ఎక్కువైంది. పలువురు ప్రజాప్రతినిధులు తమ అనుచరులకు ఇందులో దుకాణాలను ఇప్పిస్తుండడంతో మార్కెట్‌లోకి వెళ్లే దారి కూడా ఆక్రమణకు గురైంది. ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ అందుబాటులోకి వచ్చేవరకైనా అధికారులు ఈ మార్కెట్‌లో ఆక్రమణలను తొలగించి సౌకర్యాలు కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



కోదాడ మున్సిపల్‌ కార్యాలయానికి ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్‌లో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. దీంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని ఆక్రమించి ఇతరులకు లీజులకు ఇస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. పన్నులు వసూలు చేయడమే కాదు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత కూడా మున్సిపల్‌ అధికారులపై ఉంది.

– కుదరవల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త, కోదాడ

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ నాయకులు

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గుట్టల్లో గల శ్మశాన వాటికలో తమ కులపెద్దల సమాధులను తొలగించి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన ఎస్సీ కుల నాయకులు సోమవారం చిలుకూరు మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీఓ గిరిబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం చిలుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలనకు వచ్చిన ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్‌ ధృవకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ నాయకులు మాట్లాడుతూ సీతారాంపురం గుట్టల నుంచి గత కొన్ని రోజులుగా రోజుకు వందల ట్రిప్పుల మట్టిని టిప్పర్లతో తరలిస్తున్నారని తెలిపారు. ఈ విషయం మండల స్థాయి అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్సీ కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతిక అకాడమీ చైర్మన్‌కు సన్మానం



అలేఖ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

హుజూర్‌నగర్‌ : పట్టణంలో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవంలో పాల్గొన్న తెలంగాణ సాంస్కృతిక అకాడమీ చైర్మన్‌ పద్మశ్రీ డాక్టర్‌ పుంజాల అలేఖ్యను కాంగ్రెస్‌ నాయకులు సత్కరించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ అర్చన రవి, వైస్‌ చైర్మన్‌ సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, కేఎల్‌ఎన్‌ ప్రసాద్‌ గౌడ్‌, సైదానాయక్‌, ముడెం గోపిరెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి ఆమెను శాలువాలతో సన్మానించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు సోమవారం విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. అనంతరం కల్యాణ తంతు పూర్తి చేశారు. శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్‌, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్‌, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, మార్తి దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

కోత, కుట్లు లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్‌ నాగిని

నేరేడుచర్ల : కుటుంబ నియంత్రణకు పురుషులు ఎలాంటి అపోహలు లేకుండా వాసెక్టమీ ఆపరేషన్‌ చేయించుకోవచ్చని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్‌ నాగిని అన్నారు. సోమవారం నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాసెక్టమీ పక్షోత్సవాల్లో భాగంగా ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎలాంటి కోత, కుట్లు లేకుండా వాసెక్టమీ ఆపరేషన్‌ ఉంటుందన్నారు. ఆపరేషన్‌ తరువాత దైనందిన కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండదని అన్నారు. సూర్యాపేట, హుజూర్‌నగర్‌, కోదాడతో పాటు ఏరియా ఆసుపత్రుల్లో వాసెక్టమీ ఆపరేషన్‌ ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ ఆపరేషన్‌పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో హెల్త్‌ సూపర్‌వైజర్‌ ధనమ్మ, అసిస్టెంట్‌ నర్సయ్య, ఏఎన్‌ఎంలు విజయ, సుశీల, రేణుక, సునిత, నాగమణి, నాగేంద్రమ్మ, భూలక్ష్మి, శిరీష, క్రాంతి తదితరులు ఉన్నారు.

మడేలేశ్వరాలయ నిర్మాణానికి శంకుస్థాపన



దాతలను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో రజకుల ఆరాధ్య దైవం శ్రీమడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన స్థల దాత మైలార్‌శెట్టి చిన్న ఎలమందయ్య, జానకమ్మ చేతుల మీదుగా సోమవారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మైలార్‌శెట్టి భిక్షమయ్య, కనకమ్మ దంపతులు, వారి కుమారులు మైలార్‌శెట్టి కృష్ణయ్య సుజాత, మైలార్‌శెట్టి భాస్కర్‌ రాజేశ్వరి దంపతులు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రజక సంఘం పెద్దలు స్థల, నిర్మాణ దాతలను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ముసి శ్రీనివాస్‌, మొలుగూరి నాగరాజు, రాంబాబు, భిక్షం, వెంకన్న, సీతారాములు, రజక సంఘం కులపెద్దలు పారెల్లి శంకర్‌, సోమశేఖర్‌, గోపయ్య, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో వైభవంగా శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్‌ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ నల్లకట్ల సంతాన కామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి శాంతి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, నిత్యాగ్నిహోత్రి, అష్టోత్తర సహస్రనామార్చన నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ చిమట సైదులు, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌ దేశ్‌ముఖ్‌, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు డ్రోన్‌ల వాడకంపై అవగాహన

నడిగూడెం : రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నడిగూడెం రైతు వేదికలో డ్రోన్‌ల వాడకంపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రతి మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్సులో నిర్వహించే శిక్షణకు రైతులు హాజరు కావాలని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులకు వ్యవసాయంలో డ్రోన్ల వాడకంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశం

నేరేడుచర్ల : గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ మందిరంలో వార్డుల వారీగా ఓటరు జాబితాపై 26వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటలకు అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల పక్షాల నాయకులు హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు.

నేడు రాజ్యాంగంపై సదస్సు

కోదాడ : భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి ఈ నెల 26తో 75 సంవత్సరాలు పూర్తి అవుతున్నందున కేంద్ర సమాచార, ప్రచార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం అనంతగిరి సమీపంలోని అనురాగ్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో రాజ్యాంగంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు హరినాథ్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగంపై వ్యాసరచన, క్విజ్‌ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.

బైక్‌ ర్యాలీని విజయవంతం చేయాలి

నేరేడుచర్ల : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబోయే బైక్‌ ర్యాలీని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. సోమవారం నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, నాగరాజు, వీరస్వామి ఉన్నారు.

పదకొండేళ్లుగా అన్నదానం అభినందనీయం



కోదాడరూరల్‌ : అన్నదానం ప్రారంభిస్తున్న వ్యవసాయ మార్కెట్‌ కార్యదర్శి రాహుల్‌

కోదాడరూరల్‌ : గత 11 ఏళ్లుగా దాతలు, సొంత ఖర్చులతో మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని వ్యవసాయ మార్కెట్‌ కార్యదర్శి రాహుల్‌ అన్నారు. సోమవారం కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్‌ రోడ్డులో గల గాలి రమేష్‌ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

- కార్తీక సోమవారం పూజలు



మేళ్లచెరువు : శివుడికి పూజలు చేస్తున్న అర్చకులు



నేరేడుచర్ల : శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. నేరేడుచర్లలోని శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఉగ్రదండి శివప్రసాద్‌ శర్మ, మండలంలోని బురుగులతండా వద్ద గల పురాతన సోమప్ప ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శ్రీనివాసశాస్త్రి, దిర్శించర్ల శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణికుమారశర్మలు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలు శివ నామ స్మరణలో మారుమోగాయి.

మేళ్లచెరువులో కోటి దీపోత్సవం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, ఆశీర్వచనాలు, తదుపరి తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, విశేష పుష్పాలంకరణ, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. భక్తులు ఆలయంలో కార్తీక దీపాలు వెలగించారు. మండల కేంద్రంలోని శివాలయంలో స్పటిక లింగానికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో పూజారి కొంపెల్లి కృష్ణశాస్త్రి, ఆలయ చైర్మన్‌ రామారావు, గట్టికొప్పుల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమలింగేశ్వరస్వామి ఆలయంలో..

హుజూర్‌నగర్‌ : కార్తీక సోమవారం సందర్భంగా హుజూర్‌నగర్‌ పట్టణంలోని శ్రీపార్వతి భీమలింగేశ్వ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పూజారులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : కీతవారిగూడెం శివాలయంలో..



హుజూర్‌నగర్‌ : పూజల్లో పాల్గొన్న భక్తులు



మేళ్లచెరువు : కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్‌ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ శ్రీలక్ష్మీనరసింహ, వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని భక్తులు సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ యరగాని గురువయ్యాగౌడ్‌, ఈఓ ఎంపి లక్ష్మణ్‌రావు, ధర్మకర్తలు అంజయ్య, హరీష్‌కుమార్‌, కవిత, నరసింహారావు, కృష్ణప్రసాద్‌, హనుమంతరావు, అర్చకులు హరీష్‌కుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న అమెరికా దేశ యంగ్‌ పోయెట్‌ మాజీ రాయబారి విధాత్రి

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల రామాలయంలో కార్తీక మాసం సందర్భంగా బిగ్‌ గ్రాఫ్‌ ఏఐ టెక్నాలజీస్‌ కంపెనీ సీఈఓ కీత నాగేశ్వరరావు– సునీతల కుమార్తె అమెరికా దేశ యంగ్‌ పోయెట్‌ మాజీ రాయబారి కీత విధాత్రి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశం.. గొప్ప ఆధ్యాత్మిక దేశం కావడం అందులో మన గ్రామంలో రామాలయం నిర్మాణ భాగ్యం మా కుటుంబానికి కలగడం మా అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కీత కోటయ్య, కనకమ్మ, అరవింద్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని సందర్శించి.. అవగాహన కల్పించి



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్‌ డిగ్రీ విద్యార్థులు, శాస్త్రవేత్తలు

గరిడేపల్లి : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్‌ డిగ్రీ విద్యార్థినులు సోమవారం మండలంలోని గడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని గ్రామ పటం, వెన్‌ డయాగ్రమ్‌ పైచార్ట్‌, చిత్రాలను ప్రదర్శించి పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సీహెచ్‌ నరేష్‌, ఎ.నరేష్‌, వ్యవసాయ విద్యార్థినులు గీతిక, హిరణ్మయి, హరిణి, కృష్ణవేణి, నందిని, మేఘన, శ్రీవర్ధిని, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళా ప్రదర్శన

కోదాడరూరల్‌ : కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కోదాడ మండలంలోని కాపుగల్లు, నల్లబండగూడెంలో ప్రజాపాలనపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకు గ్యాస్‌ సిలిండర్‌, రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్‌ వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంచందర్‌రావు, పాండురంగన్న, కార్యదర్శులు వెంకటనారాయణ, అరుణకుమారి, టీం లీడర్‌ ఈర్ల సాయి, గడ్డం ఉదయ్‌, వెన్నెల నాగరాజు, శ్రీకాంత్‌, శంకర్‌, ఉపేందర్‌ తదితరులు ఉన్నారు.

నేరేడుచర్ల మండలంలో..

నేరేడుచర్ల : ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నేరేడుచర్ల మండల కేంద్రంతో పాటు దాచారం, కల్లూరు గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ పథకాలపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీమ్‌ లీడర్‌ వేముల శ్రవణ్‌, కళాకారులు రాము, భిక్షపతి, లక్ష్మణ్‌, నాగలక్ష్మి, ప్రియాంక, శ్రవంతి, మేడి ప్రియదర్శిని, మున్సిపల్‌ సిబ్బంది ఉన్నారు.

మాలలు నిగ్గదీసి అడిగే సమయమిదే



స్రవంతికి నియామకపత్రం అందజేస్తున్న బాబురావు

హుజూర్‌నగర్‌ : వర్గీకరణపై మాలలు నిగ్గదీసి అడిగే సమయం ఆసన్నమైందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్‌ డి.బాబురావు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌ హాల్‌లో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌, పీవీ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండలం మహిళా అధ్యక్షురాలిగా శ్రీనివాసపురానకు చెందిన మీసాల స్రవంతిని నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకుల్లు బెంజిమెన్‌, రాములు, రాము, పున్నయ్య, చప్పిడి సావిత్రి, అరుణ్‌, నరసయ్య, రాజు, వెంకన్న, ప్రవీణ్‌, వినోద్‌, పెంటయ్య, యువకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పాలకవీడు : మండలంలో పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్‌ కమలాకర్‌ సోమవారం పంపిణీ చేశారు. జాన్‌పహాడ్‌, బెట్టె తండా గ్రామాల్లోని లబ్ధిదారులు బాణావత్‌ రేణుక, భూక్యా రోజా, దీరావత్‌ శారద, మాలోతు బుల్లీలకు మంజూరైన చెక్కులను అందజేశారు. కాంగ్రెస్‌ నాయకులు మాలోతు మోతీలాల్‌నాయక్‌, శివకృష్ణ, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌పీ.సుబ్బారావు నాగయ్య, శేషు, నగేష్‌, శ్రీను, కిషన్‌, వినోద్‌ పాల్గొన్నారు.